సాక్షి
విజయనగరం

గురువారం । 15 । ఆగస్టు । 2024



ఇసుక లేదు.. రావద్దు

కూటమి ప్రభుత్వం ఇసుక సరఫరాలో చేతులెత్తేసింది. కొత్తవలస, డెంకాడ మండలాల్లోని ఇసుక స్టాక్ యార్డుల్లో ఇసుకలేదు. సరఫరా ఆగిపోయింది. - IIలో



లాఠీ పట్టాల్సిందే..!

విధి నిర్వహణలో భాగంగా పోలీస్ సిబ్బంది విధిగా లాఠీ పట్టాల్సిందేనని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు జారీచేశారు. - IIలో



రాష్ట్ర పరేడ్‌కు కొత్తవలస విద్యార్థులు

కొత్తవలస: విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి స్వాతంత్య్ర వేడుకల్లో నిర్వహించే పరేడ్‌లో కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ నిహారిక, ఎస్.కుసుమ, టి.మనోహర్‌లు పాల్గొంటారని స్కౌట్‌గైడ్ ఎ.కనకలక్ష్మి బుధవారం తెలిపారు.

న్యూస్‌రీల్

సూక్ష్మ స్వర్ణ భారత్



బంగారు తీగతో తయారుచేసిన భారతదేశ పటం

రాజాం సిటీ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కస్పా వీధికి చెందిన మైక్రో ఆర్టిస్ట్, స్వర్ణకారుడు ఎం.జగదీష్ బంగారు తీగతో సూక్ష్మ భారతదేశ చిత్రపటాన్ని తయారుచేసి ఔరా అనిపించారు. 0.060 మిల్లీ గ్రాముల బంగారు తీగతో సూక్ష్మ భారత్‌ను 30 నిమిషాల వ్యవధిలో తయారుచేసినట్టు తెలిపారు.

ఢిల్లీలో స్వాతంత్య్ర వేడుకలకు ఇద్దరు సర్పంచ్‌లు



ఢిల్లీలోని ఎర్రకోట వద్ద రావివలస, పుల్లేయవలస సర్పంచ్‌లు

చీపురుపల్లి: ఢిల్లీలోని ఎర్రకోట వేదికగా జరిగే స్వాతంత్య్రదినోత్సవ వేడుకలను వీక్షించేందుకు చీపురుపల్లి మండలం రావివలస సర్పంచ్ పనస మణికంఠ, పుల్లేయవలస సర్పంచ్ సారిక మోహనరావు ఢిల్లీ చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ముందంజలో నిలవడంతో ఇద్దరు సర్పంచ్‌లను కేంద్ర ప్రభుత్వం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించింది.

ఆకట్టుకునేలా పరేడ్ నిర్వహణ



పరేడ్ గ్రౌండ్‌లో మాక్‌డ్రిల్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: విజయనగరం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆగస్టు 15న నిర్వహించే సాయుధ పోలీసుల పరేడ్ రిహార్సల్స్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం పర్యవేక్షించారు. కవాతు నిర్వహణలో అధికారులకు పలు సూచనలిచ్చారు. ఆకట్టుకునేలా ఉండాలన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు రెవెన్యూ అధికారులు, ఇతర శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణ, పోలీస్ కవాతు, శకటాల ప్రదర్శన, భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సోల్మన్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఎస్‌బీ సీఐలు కేకేవీ విజయనాథ్, ఇ.నరసింహమూర్తి, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు ఎన్.గోపాలనాయుడు, ఆర్.రమేష్‌కుమార్, టి.భగవాన్, ఆర్‌ఎస్‌ఐలు, సాయుధ పోలీసులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపైనా మువ్వన్నెల జెండా ఎగరాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేసేలా, ప్రతి ఊరిలో మువ్వన్నెల స్ఫూర్తి నింపే ర్యాలీలు నిర్వహించేలా ప్రజలను చైతన్య పరచాలని మండల, క్షేత్రస్థాయి సిబ్బందిని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, హౌసింగ్ ఏఈలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలెక్టరేట్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ సమైక్యతను, దేశభక్తిని చాటిచెప్పేలా గుడ్డతో తయారు చేసిన జెండాలను ఎగురవేయాలన్నారు. మండల కార్యాలయాల్లో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసి ప్రజలు పెద్ద సంఖ్యలో సెల్ఫీలు దిగేలా చూడాలన్నారు. వాటిని హర్‌ఘర్ తిరంగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా, జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బర్నింగ్ వార్డులో బెడ్‌లు ఇలా...



ఆస్పత్రిలోని ఆక్సిజన్ సిలిండర్లు



వైద్యుడి కోసం ఎదురుచూపు..



ఆస్పత్రికి చేరుకున్నా.. స్ట్రెచర్ కోసం వేచిచూడాల్సిందే..



దుప్పట్ల దుస్థితి



సర్కారు ఆస్పత్రికి సమస్యల రోగం



ఓపీ కోసం పడిగాపులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సామాన్య రోగులకు సత్వర వైద్యసేవలు అందించాల్సిన విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఇప్పుడు ప్రతి రోజూ రోగులు నరకం చూస్తున్నారు. రెండు నెలల వ్యవధిలోనే సేవల తీరు గాడి తప్పుతుండటంతో ఐదేళ్ల క్రితం నాటి రోజులు వచ్చాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9 గంటలకు రావాల్సిన వైద్యులు 10 గంటలైనా కనిపించడంలేదు. వైద్యుల కోసం రోగులు గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. కొంతమంది వైద్యులు సమయానికి వచ్చేసి ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేస్ రికగ్నైజేషన్ టైమ్ అటెండెన్స్ సిస్టమ్)లో హాజరు వేసుకొంటున్నారు. తర్వాత టీ, కాఫీ బ్రేక్ అని చెప్పి మధ్యలో ఒకసారి సొంత క్లినిక్‌లకు వెళ్లి వస్తున్నారు. ఆస్పత్రిని సోమవారం పరిశీలించిన 'సాక్షి' బృందానికి రోగులు తమ ఆవేదనను వినిపించారు. సమస్యలను ఎత్తి చూపారు. ఆస్పత్రి నిర్వహణ లోపాలను తెలియజేశారు. వైద్యసేవల తీరులో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు.

– సాక్షి ప్రతినిధి, విజయనగరం

మళ్లీ ఐదేళ్ల వెనక్కి!

- జిల్లా సర్వజన ఆస్పత్రిలో రోగులకు నరకం
- రెండు నెలల్లోనే గాడి తప్పుతున్న పరిపాలన
- వైద్యుల కోసం గంటల తరబడి ఎదురు చూపులు
- రోగులకు సాయంచేయని ఆస్పత్రి సిబ్బంది
- వీల్‌చైర్లపై కుటుంబసభ్యులే తీసుకెళ్లాల్సిన పరిస్థితి
- మధ్యాహ్నం ఒంటిగంట దాటితే అడ్మిషన్ కష్టమే
- భోజన విరామమే రెండు గంటలు తీసుకుంటున్న వైనం
- వార్డుల్లో కిక్కిరిసిపోతున్న రోగులు
- ఒకే బెడ్ ఇద్దరు ముగ్గురు సర్దుకోవాల్సిందే
- ఆస్పత్రి ఆవరణలో మళ్లీ పాత కాలం నాటి నిర్లక్ష్యమే
- పరిసరాల్లో కానరాని పారిశుద్ధ్య నిర్వహణ

ఏ మాత్రం సమస్య అనిపించినా రోగులను విశాఖలోని కేజీహెచ్‌కో లేదంటే ప్రైవేట్ ఆసుపత్రికో రిఫర్ చేసేసే పరిస్థితి మారిందీ... అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుతున్నాయి... అని ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలకు లభించిన ఊరట మున్నాళ్ల ముచ్చటే అయ్యింది. గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీని రూ.500 కోట్ల వ్యయంతో సాకారం చేశారు. దానికి అనుబంధంగా మరో రూ.10 కోట్ల వరకూ వ్యయంతో విజయనగరంలోని జిల్లా ఆస్పత్రిని బోధనాస్పత్రిగా తీర్చిదిద్దించారు. అందుకు తగినట్లుగా వైద్యులను, నర్సింగ్ సిబ్బందిని, ఇతరత్రా అసిస్టెంట్లనూ నియమించారు. మౌలిక వసతులన్నీ కల్పించారు. వార్డులన్నీ ఆధునీకరించారు. ఫలితంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎవరికి ఏ రకమైన వైద్యం కావాలన్నా ఇక్కడికొచ్చేలా తీర్చిదిద్దారు. అంతా బాగుందీ, ఎక్కడికో వెళ్లాల్సిన వ్యయప్రయాసలు తప్పాయని ప్రజలు ఊరట చెందుతున్న సమయంలో ప్రభుత్వం మారింది. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చింది. ఎన్నికల ఫలితాలు వెలువడగానే ఆస్పత్రి నేమ్ బోర్డును టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసి తమకు కావాల్సిన పేరును తగిలించినట్లే ఆస్పత్రిలోని వైద్యులు, వైద్య సిబ్బంది, ఇతరత్రా అసిస్టెంట్స్ కూడా తమ రూట్ మార్చేశారు. ఆస్పత్రి పరిపాలనను గాడి తప్పించేశారు.

వైద్యుల దర్శనం అదృష్టమే..

ఉమ్మడి విజయనగరం జిల్లాలో మారుమూల ప్రాంతాల నుంచి ప్రతి రోజు వెయ్యి మంది వరకూ సర్వజన ఆస్పత్రికి ఓపీకి వస్తున్నారు. ఓపీ విభాగంలో నమోదుచేయించుకొని ఓపీ తీసుకున్న 20 నుంచి 30 నిమిషాల వ్యవధిలోనే సంబంధిత వైద్యుల దగ్గరకు వెళ్తున్నారు. ఓపీలో వైద్యులు సమయానికి వస్తే వారి అదృష్టమే. డాక్టర్లు సూచించిన వైద్య పరీక్షలు సకాలంలో పూర్తి చేయించుకోలేకపోయినా ఇబ్బందులు తప్పట్లేదు. రిపోర్టులు చేతికి వచ్చేసరికి మధ్యాహ్నం ఒంటిగంట అయితే మళ్లీ 3 గంటల వరకూ రోగులు నిరీక్షించాల్సిందే. అయితే అత్యవసర విభాగంలో మాత్రం ఐదు పది నిమిషాల్లోనే చేర్చుకోవడం కాస్త ఊరట.



సమయం అయినా రాని ఆర్థోపెడిక్ చికిత్స గది



నేలపైనే సేదతీరుతున్న రోగుల కుటుంబ సభ్యులు

ఉదయం పది గంటల వరకూ డాక్టర్ రాలేదు



నాకు చేతులు వణుకు వస్తున్నాయని నరాల డాక్టర్‌కు చూపించుకోవడానికి విజయనగరం వచ్చాను. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి ఉదయం 9 గంటలకే వచ్చేశాను. 10 గంటల వరకు డాక్టర్ రాలేదు. అంతవరకు ఓపీ విభాగం దగ్గరే కూర్చున్నాను.

– ఎ.రామప్పలస్వామి, పూల్‌బాగ్ కాలనీ, విజయనగరం

రోగులను పట్టించుకునేవారేరీ



ఆస్పత్రికి నడవలేని పరిస్థితుల్లో వచ్చిన రోగులను వీల్ చైర్స్‌లో కూర్చోబెట్టి తీసుకెళ్లాల్సిన సిబ్బంది ఇప్పుడు ముఖం చాటేస్తున్నారు. రోగులతో వచ్చిన కుటుంబసభ్యులే వీల్‌చైర్ తీసుకొచ్చి ఆ పనిచేసుకోవాల్సి వస్తోంది. ఒక్కోసారి ఆ వీల్‌చైర్ కూడా కనిపించకపోతే ఓపీ విభాగాలకు, డ్రెస్సింగ్ కోసం ఎత్తుకొని తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అంతేకాదు వార్డుల్లో బెంచీలు తక్కువే ఉండడంతో రోగులు ఎక్కువ మంది నిలబడే ఉండాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

చాలీచాలని పడకలు



ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు

వార్డుల్లో పడకలు (బెడ్స్) సరిపోవట్లేదు. దీంతో ఒకే బెడ్‌పై ఇద్దరు లేదా ముగ్గురు రోగులు సర్దుకుంటున్నారు. ఉదాహరణకు ఫిమేల్ వార్డులో 34 బెడ్‌లు ఉంటే అక్కడ చికిత్స పొందుతున్నవారు 54 మంది ఉన్నారు. ప్రస్తుతం విషజ్వరాల వ్యాప్తి అధికంగా ఉండడం వల్ల ప్రతిరోజు అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు. వైరల్, మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలతో బాధపడుతున్నవారితో వార్డు కిటకిటలాడుతోంది. దీంతో కొంతమంది రోగులకు వరండాలోనే బెడ్‌లు వేస్తున్నారు. అక్కడే రోగులు సర్దుకుంటున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం



ఆస్పత్రి గోడలు ఇలా..

ఆస్పత్రిలో పారిశుద్ధ్యం ఎంత బాగా నిర్వహిస్తే రోగులకు అంత సౌకర్యంగా ఉంటుంది. అంతే కాదు రోగాల వ్యాప్తికీ అడ్డుకట్ట పడుతుంది. కానీ ఆస్పత్రిలో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. ఎమెర్జెన్సీ వార్డు, ఫిమేల్ సర్జకల్, మెడికల్ వార్డులకు వెళ్లే మార్గంలో గోడలను చూస్తే కిళ్లీ వ్యర్థాలు, ఉమ్ములతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఆస్పత్రి ఆవరణలో కూడా చెత్త పేరుకుపోతోంది. చివరకు గ్లౌజులు కూడా అక్కడే పడేస్తున్నారు. తాగేసిన డ్రింక్ సీసాలు, వాటర్ బాటిల్స్ కూడా డస్ట్ బిన్‌లో వేయట్లేదు. అవన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయి.



ఆస్పత్రి పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

జేసీగా సేతు మాధవన్ బాధ్యతల స్వీకరణ



జేసీగా బాధ్యతలు చేపట్టిన సేతుమాధవన్

విజయనగరం అర్బన్: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎస్.సేతుమాధవన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన కె.కార్తీక్ చెల్లూరు జేసీగా బదిలీపై వెళ్లారు. సేతు మాధవన్ పార్వతీపురం ఐటీడీఏ పీఓగా పనిచేస్తూ జిల్లాకు బదిలీపై వచ్చారు. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా కందికుప్పం గ్రామానికి చెందిన సేతుమాధవన్ సివిల్ ఇంజినీరింగ్ చదివి 2021లో సివిల్స్‌కు ఎంపికయ్యారు. శిక్షణానంతరం ప్రకాశం జిల్లా ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ పొందారు. ఆ తరువాత మార్గాపురం సబ్‌కలెక్టర్‌గా, ఎంఎస్‌ఎంఈ శాఖలో సీఈఓగా పని చేశారు. అక్కడి నుంచి నెల్లూరు జేసీగా పనిచేసి కొద్దిరోజుల కిందటే పార్వతీపురం ఐటీడీఏ పీఓగా బదిలీపై వచ్చారు. ఆయన భార్య శోభిక ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన మాధవన్‌కు డీఆర్‌ఓ ఎస్.డి.అనిత, ఆర్డీఓలు ఎం.వి.సూర్యకళ, ఎ.సాయిశ్రీ, బి.శాంతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛాలను అందించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను జేసీ మర్యాద పూర్వకంగా కలిశారు. వివిధ అంశాలపై చర్చించారు.

మువ్వన్నెల స్ఫూర్తి

- బొబ్బిలిలో 150 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్ సంయుక్తంగా 150 అడుగుల జాతీయ జెండాను బుధవారం ప్రదర్శించాయి. సుమారు రెండు వందల మంది విద్యార్థులు జెండా ప్రదర్శనలో పాల్గొని మువ్వన్నెల స్ఫూర్తినింపారు. తాండ్రపాపారాయుడి కూడలిలో జాతీయ జెండాను నిలిపినప్పుడు దేశభక్తి ఉప్పొంగేలా విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎ.సాయిశ్రీ మాట్లాడుతూ ప్రజలకు జాతీయ స్ఫూర్తినిచ్చేది జాతీయ జెండా ఒక్కటేనని అన్నారు. కమిషనర్ ఎల్.రామలక్ష్మి, మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు రౌతు రామమూర్తి నాయుడు, రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్ కార్యవర్గం, యువత పాల్గొన్నారు.



తాండ్రపాపారాయుడి కూడలిలో జాతీయ జెండా ప్రదర్శన

నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్రనాయుడు

విజయనగరం ఫోర్ట్: పశ్చిమ బెంగాల్‌లో వైద్యవిద్యార్థినిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముర్రు జయచంద్రనాయుడు డిమాండ్ చేశారు. హత్యకు గురైన వైద్య విద్యార్థిని మోమిత దేబనాథ్ చిత్రపటానికి విజయనగరంలోని ఐఎంఏ హాల్‌లో బుధవారం పూలమాసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రులను సేఫ్ జోన్‌లో ఉంచాలని, ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై జాతీయ స్థాయిలో పోరాటం చేస్తామని తెలిపారు. వైద్యుల రక్షణ కోసం కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, జిల్లా నాయకులు డాక్టర్ అశోక్, డాక్టర్ మహేంద్రగిరి, డాక్టర్ లెంక శ్రీనివాస్‌రావు, డాక్టర్ త్రినాథ్‌రావు, డాక్టర్ వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.



వైద్య విద్యార్థిని చిత్రప నివాళులర్పిస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్రనాయుడు

విజయం ప్రీతిపాత్రం



థాయ్‌లాండ్‌లో ఈ నెల 10న జరిగిన జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్-2024 పోటీల్లో విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన ప్రీతి పట్నాయక్ మిస్ ప్రీ టీన్‌గా నిలిచింది. ఈ పోటీల్లో ప్రపంచ నలుమూలల నుంచి 40 మంది బాలికలు పాల్గొన్నారు. నృత్యం, అందం విభాగంలో 'ప్రీతి'కర విజయం నమోదుచేసినట్టు బాలిక తల్లిదండ్రులు అనిత, ప్రసాద్‌లు స్థానిక విలేకరులకు బుధవారం తెలిపారు. గతంలో కేరళ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించి రన్నరప్ టైటిల్‌ను సొంతం చేసుకుందన్నారు. ప్రీతి పట్నాయక్ విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. అందాల పోటీల్లో రాణిస్తున్న బాలికను నాన్నమ్మ తాతయ్యలు జగదాంబ, లక్ష్మీపతి పట్నాయక్, శిష్టకరణ సంఘం జిల్లా కార్యదర్శి రేగ సురేష్, పురిటి పెంట-2 ఎంపీటీసీ సభ్యురాలు రేగలత తదితరులు అభినందించారు.

– గజపతినగరం



క్లుప్తంగా

కొత్త ఎంపీడీఓలు వీరే

విజయనగరం ఫూల్‌బాగ్: మండలపరిషత్ అభివృద్ధి అధికారుల బదిలీలు మొదలయ్యాయి. ఈ మేరకు జెడ్పీ సీఈఓ(ఎఫ్ఏసీ) ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజా ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త ఎంపీడీఓలు విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొనడంతో చాలా మంది బుధవారం విధుల్లో చేరారు. అయితే గతంలో ఏఏ మండలాల్లో పనిచేసిన వారిని శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారో వారందరికీ పాతస్థానాల్లోనే పోస్టింగ్ ఆర్డర్స్‌ను ప్రభుత్వం ఇచ్చింది. ఆ ప్రకారం ఎంపీడీఓల వివరాలిలా ఉన్నాయి.

విజయనగరం జిల్లా	
ఎం.రత్నం	మెరకముడిదాం
డీడీ స్వరూపారాణి	డెంకాడ
బి.కల్యాణి	గుర్ల
వై.పద్మజ	కొత్తవలస
జి.గిరిబాల	నెల్లిమర్ల
వైవీ రాజేంద్రప్రసాద్	బొండపల్లి
కె.రామకృష్ణంరాజు	చీపురుపల్లి
ఎంవీబీ సుబ్రహ్మణ్యం	దత్తిరాజేరు
కె.కిశోర్‌కుమార్	గజపతినగరం
జి భాస్కరరావు	గరివిడి
పి.త్రివిక్రమరావు	మెంటాడ
ఎస్.రామకృష్ణ	తెర్లాం
పార్వతీపురం మన్యం జిల్లా	
కె.సాల్మన్‌రాజు	జీఎల్‌పురం
సీహెచ్ సూర్యనారాయణ	మక్కువ
కె విజయలక్ష్మి	బలిజిపేట
జి.పైడితల్లి	గరుగుబిల్లి

ఏనుగుల గుంపు బీభత్సం

వంగర: మండల పరిధి వీవీఆర్.పేటలో ఏనుగుల గుంపు బీభత్సం సృష్టిస్తోంది. నాలుగు రోజులుగా ఇక్కడే తిష్ఠవేసి పెద్ద ఎత్తున పంటలకు నష్టం కలిగిస్తోంది. ప్రజలకు ఎటువంటి ప్రమాదం కలగకుండా అటవీ, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగులను తరలించి పంటనష్టం వాటిల్లిన బాధితులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గోతిలో దిగబడిన లారీ



సింగిడి వద్ద నీటి గుంటలో ఇరుక్కుపోయిన ఇసుక లారీ

భామిని: మండలంలోని ఏబీ రోడ్డులో ఏర్పడిన గోతులతో ప్రయాణ కష్టాలు పడుతుండగా దానికి తోడు మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ నీటి గుంటలుగా మారాయి. దీంతో రోడ్డు ఆకారం కనిపించక పోవడంతో సింగిడి వద్ద రోడ్డుపై గల నీటి గుంటలో బుధవారం ఓ ఇసుకలారీ దిగబడింది. ఒడిశా నుంచి బత్తిలి మీదుగా వస్తున్న ఇసుక లారీ దిగబడి రోజంతా ప్రయాణ కష్టాలు కలిగించింది. సాయంత్రానికి వర్షం తగ్గాక పొక్లెయినర్లు తెచ్చి ఇసుక లారీని నీటి గుంట నుంచి బయటకు తీశారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



పి.దేవానంద్

గుమ్మలక్ష్మీపురం: పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరతను అధిగమించడానికి పని సర్దుబాటు ద్వారా కాకుండా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి, ఖాళీ స్థానాలను డీఎస్సీ ద్వారా భర్తీ చేసేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పి.దేవానంద్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏడాదిగా నిలిచిపోయిన నెలవారీ పదోన్నతుల ప్రక్రియను మళ్లీ ప్రారంభించాలని, పాఠశాలలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల్లో అత్యవసరంగా పరిష్కరించాల్సినవి పరిష్కరించి పాఠశాలలను పరిరక్షించడంతో పాటు విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం దోహదపడాలని దేవానంద్ ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పీడీఎస్ బియ్యం సీజ్

గజపతినగరం: మండలకేంద్రంలో జాతీయ రహదారి పక్కన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వెనుక భాగంలో ఉన్న వాసవి ట్రేడర్స్ రైస్ మిల్లులో విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, పౌరసరఫరాల శాఖ అధికారులు బుధవారం దాడులు చేసి 21,950 కేజీలు (సుమారు 470) బస్తాల్లో ప్యాకింగ్ చేసి ఉన్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. అధికారులు మిల్లులో సోదాలు చేసినప్పుడు పీడీఎస్ బియ్యం స్టాక్ పాయింట్‌ను చూసి నివ్వెరపోయారు. ఇంత భారీ మొత్తంలో అక్రమంగా పీడీఎస్ బియ్యం ఎలా తీసుకు రాగలిగారని మిల్లు యాజమాన్యాన్ని ఆరా తీశారు. మొత్తం ఒక లారీ, ఒక ఆటోలో లోడ్‌తో ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్‌కు అప్పగించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. అనంతరం నిందితులపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు శ్రీరామ్, సామాలు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹98	₹166	₹176

ఇసుక లేదు.. రావద్దు

- మూన్నాళ్ల ముచ్చటగా మారిన చంద్రన్న ఇసుక పాలసీ..
- కొత్తవలస ఇసుక స్టాక్ యార్డును మూసేసిన అధికారులు
- ఆకతాయిల చేతుల్లో ధ్వంసమైన సీసీ కెమెరాలు
- మూలకు చేరిన వే బ్రిడ్జి, పొక్లెయిన్‌లు
- గత ప్రభుత్వంలో చివరి నిల్వ 11,805 టన్నులు
- ప్రస్తుత ప్రభుత్వంలో జరిగిన ఇసుక అమ్మకాలు 6,976 టన్నులు
- మిగిలిన 4,829 టన్నుల ఇసుక నేతలకే ఎరుక!



ఇసుక లేకుండా ఖాళీగా దర్శనమిస్తున్న కొత్తవలస ఇసుక యార్డు

కొత్తవలస: తమ్ముళ్లూ.. అవసరమైన వారందరికీ ఉచితంగానే ఇసుక సరఫరా చేస్తాం.. నిర్మాణ రంగానికి ఊతమిస్తామిస్తాం.. ఈ విషయాన్ని ఊరూరా చెప్పి ఓట్లు అడగండి అంటూ ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు ఊదరగొట్టారు. ఉచితంగానే ఇసుక ఇస్తున్నామంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో కొత్తవలస, బొబ్బిలి, డెంకాడ వద్ద ఉన్న ఇసుక యార్డులలో స్టాక్ చేసిన ఇసుకను రవాణాచార్జీల పేరుతో అధిక వసూళ్లతో అమ్మకాలను ప్రారంభించారు. ఇప్పుడు కొత్తవలస, డెంకాడ యార్డుల్లో స్టాక్ చేసిన ఇసుక నిల్వలు అయిపోవడంతో చేతులెత్తేశారు. యార్డులను మూసేశారు. ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నా కూటమి నాయకులు పట్టించుకోవడం లేదు. ఉచిత ఇసుక అంటూ హడావిడి చేసిన నేతలు ఇప్పుడు కనిపించడంలేదంటూ నిర్మాణరంగ వర్గాలు విమర్శిస్తున్నాయి.



ఇసుక యార్డు వద్ద కార్యాలయంలో ధ్వంసమైన సీసీ కెమెరాలు, ప్రింటర్లు, రికార్డులు

మూలకు చేరిన వే బ్రిడ్జి, పొక్లెయిన్‌లు



మరమ్మతులకు గురై మూలకు చేరిన పొక్లెయిన్

గత ప్రభుత్వంలో కొత్తవలస ఇసుక యార్డు నుంచి ఇసుక విక్రయాలు ప్రభుత్వం నిర్ణయించిన సాధారణ ధరలకే జరిగేవి. వాహనాలు, ఇసుక విక్రయాలతో యార్డు నిత్యం కళకళలాడేది. ప్రస్తుతం యార్డులో కనీసం తట్టెడు ఇసుక లేదు. వే బ్రిడ్జి మూలకు చేరింది. అక్కడగల పొక్లెయిన్ కూడా మరమ్మతులకు గురై మూలకు చేరింది. సీసీ కెమెరాలు, ప్రింటర్లు, రికార్డులు ఆకతాయిల చేతిలో ధ్వంసమయ్యాయి. ఇదే విషయంపై తహసీల్దార్ నీలకంఠరావు మాట్లాడుతూ ప్రస్తుతం యార్డులో ఇసుక లేకపోవడంతో అక్కడ మా సిబ్బంది ఎవరూ విధుల్లో లేరన్నారు. ఇసుక వస్తే వీఆర్వోల పర్యవేక్షణలో అమ్మకాలు చేపడతామని చెప్పారు. ఇసుక నిల్వ బాధ్యత జిల్లా ఇసుక రీచ్ అధికారులదని పేర్కొన్నారు.

4,829 టన్నుల ఇసుక ఏమైనట్టు?

గత ప్రభుత్వ హయాంలో ఎన్నిక నోటిఫికేషన్ వచ్చిన నాటికి కొత్తవలస ఇసుక యార్డులో 11,805 టన్నుల ఇసుక ఉన్నట్టు అధికారులు ధ్రువీకరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత నెల 8న స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అమ్మకాలు ప్రారంభించారు. కేవలం 20 రోజుల్లోనే ఇసుక యార్డు పూర్తిగా ఖాళీ అయింది. 6,976 టన్నుల ఇసుకను అమ్మినట్టు అధికారుల రికార్డులు చూపుతున్నారు. మరి మిగిలిన 4,829 టన్నుల ఇసుక ఏమైందని నేతలకే ఎరుక.

అదరగొట్టిన అక్కాతమ్ముళ్లు

- స్కేటింగ్‌లో సాధించిన గోల్డ్‌మెడల్స్

భోగాపురం: ఈనెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు పొల్లాచ్చి, కోయంబత్తూర్‌లో తమిళనాడు రోలర్ స్కేటింగ్ అసోసియేషన్, జిల్లా అసోసియేషన్ నిర్వహించిన 2వ ఇండియా స్కేటింగ్ గేమ్స్‌లో భోగాపురం మండలంలోని దల్లిపేట పంచాయతీ బొల్లింకలపాలెం గ్రామానికి చెందిన అక్కాతమ్ముళ్లు కార్తీకశరణ్య(13) లోహిత్‌రెడ్డి(8) గోల్డ్‌మెడల్స్ సాధించారు. గతంలో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న కార్తీకశరణ్య 42 పతకాలు, తమ్ముడు లోహిత్‌రెడ్డి 18 పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లు సత్యనారాయణ, చిట్టిబాబు అక్కాతమ్ముళ్లను అభినందించారు. తల్లిదండ్రులు అప్పన్నరెడ్డి, రత్నకుమారిలు పిలలకు స్కేటింగ్ పట్ల ఉన్న ఆసక్తి గుర్తించి ప్రత్యేక శిక్షణకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా అక్కాతమ్ముళ్లు మాట్లాడుతూ ఇండియా తరపున అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రతిరోజూ కఠోర సాధన చేస్తున్నామని తెలిపారు.



స్కేటింగ్‌లో సాధించిన గోల్డ్ మెడల్స్‌తో కార్తీక శరణ్య, లోహిత్‌రెడ్డి

దళితుల దీక్షకు ఎస్ఎఫ్ఐ మద్దతు

పార్వతీపురంటౌన్: గరుగుబిల్లి మండలంలోని శివ్వాం గ్రామ దళితులపై జరిగిన దాడులపై ఖండిస్తూ చేపట్టిన రిలే దీక్షకు మద్దతు తెలిపినట్లు ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, కె.రాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు కలెక్టరేట్ సమీపంలో నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివ్వాం దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలని, జిల్లాలో గిరిజనులు, దళితులు, పేదలు భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పెత్తందారులు దళితులపై దాడులు చేస్తుంటే అధికారులు ఏమీ పట్టినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులు చేస్తున్న వారికి అధికారి యంత్రాంగం మద్దతుగా నిలుస్తుందని నమ్మాల్సి వస్తోందని, పరిస్థితులు మారకుంటే అధికారులు, న్యాయశాఖపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లే పరిస్థితి ఉంటుందని అభిప్రాయ పడ్డారు. కలెక్టర్ వెంటనే చొరవ తీసుకుని శివ్వాం దళిత కుటుంబాలకు న్యాయం చేసి, దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించి, భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఒ.డేవిడ్. ఎ.సింహాచలం కె.శ్రీను, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పాఠశాల వాహనాలు కండిషన్‌లో ఉండాలి

పార్వతీపురంటౌన్: పాఠశాలల వాహనాలు కండిషన్‌లో ఉండాలని జిల్లా రవాణాశాఖ అధికారి ఎం.శశి కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రోడ్ ప్రమాదాల నివారణకు విద్యాసంస్థల యాజమాన్యం స్కూల్ బస్సుల విషయంలో పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని విద్యా సంస్థల యాజమాన్యాలు కింద సూచించిన నియమాలను పాటించాలని పేర్కొన్నారు. వాహనం(స్కూల్‌బస్సు) పూర్తి సామర్థ్యం(కండిషన్)లో ఉండాలి. డ్రైవర్, పర్యవేక్షకుడు వాహనంలో అందుబాటులో ఉండాలి. వాహనం బయలు దేరే ముందు పరిశీలించి ఏమైనా లోపాలు ఉంటే సరిదిద్దుకుని స్టూడెంట్స్‌తో ప్రయాణించాలి. డ్రైవర్ మొబైల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనం నడపరాదు. వాహనంలో పరిమితికి మించి ప్రయానించరాదు. స్కూల్ బస్సులో ప్రథమ చికిత్స బాక్స్ తప్పనిసరిగా ఉండాలి. స్కూల్ బస్సు బయలుదేరే ముందు లైట్స్/వైపర్స్/టైర్స్/బ్రేక్ కండిషన్ చూసుకుని బయలు దేరాలి. స్కూల్ ఆటోలో పరిమితికి మించి (6 గురు) మించి) ప్రయాణించరాదు. ఈ నిబంధలను విధిగా పాటించి తమ వాహనాలకు ఫిట్‌నెస్‌సర్టిఫికెట్ పునరుద్ధరణ చేయించి పరిమితికి మించకుండా విద్యార్థులను తీసుకు వెళ్లాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపే స్కూల్ ఆటో రిక్షాలపై జిల్లా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



జిల్లా రవాణాశాఖ అధికారి ఎం శశి కుమార్

20 కిలోల గంజాయి పట్టివేత

రామభద్రపురం: మండలకేంద్రంలోని బైపాస్ రోడ్డులో బుధవారం 20 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఉదయం 8 గంటల సమయంలో వాహన తనిఖీలు చేస్తుండగా ఒడిశా నుంచి ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని, గంజాయిని పోలీసులు పట్టుకుని నిందితుడిని విచారణ చేస్తున్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు గురువారం తెలియజేయనున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

లాఠీ పట్టాల్సిందే..!

- విధిగా గ్రామ సందర్శన చేయాలి
- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: విధి నిర్వహణలో భాగంగా పోలీస్ సిబ్బంది తప్పనిసరిగా లాఠీ పట్టాల్సిందేనని, విధి నిర్వహణలో లాఠీని తమవెంట తీసుకువెళ్లాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు జారీచేశారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న అధికారులతో మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న నిర్జన ప్రాంతాలను, రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను వేర్వేరుగా గుర్తించి, ఆయా ప్రాంతాల్లో నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళల రక్షణకు మహిళా బీట్లు ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో వేయాలని, వారు స్కూల్స్, కళాశాలలు, పరిశ్రమలు, ముఖ్య కూడళ్లు, హాస్టల్స్‌ను సందర్శించి, మహిళలతో మమేకమై, వారి భద్రతకు అండగా ఉండే చట్టాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామసందర్శనలను డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది తప్పనిసరిగా చేయాలని, స్థానిక నాయకులు, ప్రజలతో మమేకం కావాలని, గ్రామంలో సమస్యలు గుర్తించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సమస్యలను గుర్తించి, ప్రాథమిక స్థాయిలోనే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. డయల్ 100 కాల్స్‌పై తక్షణమే స్పందించి, సంఘటనా స్థలానికి చేరుకుని, పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఆధారాలు సేకరించాలి

తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులు నమోదైతే క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్ సహకారంతో, నేరస్థలంలో ఆధారాలు సేకరించాలని చెప్పారు. ఇప్పటి వరకూ వినియోగంలో ఉన్న సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసే విధంగా, ప్రధాన మార్గాలను కవర్ చేసే విధంగా ఏర్పాటుచేయాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సాల్మన్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్. చక్రవర్తి, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, న్యాయసలహాదారులు వై.పరశురాం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైలకు బదిలీలు

విజయనగరం క్రైమ్: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న ఎస్సైలకు స్థానచలనం కల్పిస్తూ ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బొండపల్లి ఎస్సైగా పనిచేస్తున్న కె.లక్ష్మణరావును గజపతినగరానికి.. గజపతినగరం ఎస్సైగా పనిచేస్తున్న యు.మహేష్‌ను బొండపల్లికిర బదిలీ చేశారు. పీటీసీలో పనిచేస్తున్న డి.సాయికృష్ణను గంట్యాడకు.. విజయనగరం టూటౌన్ ఎస్సై జి.రాజేష్‌ను బుధరాయవలసకు.. బాడంగి ఎస్సై ఆర్.జయంతిని పెదమానాపురం పీఎస్‌కు.. సంతకవిటి ఎస్సై షేక్ శంకర్‌ను వంగరకు, అదేవిధంగా పూసపాటిరేగ ఎస్సై ఎ.సన్యాసినాయుడును డెంకాడకు బదిలీ చేశారు.

సంతకాల ఉద్యమం ప్రారంభం

విజయనగరం అర్బన్: హర్ ఘర్ తిరంగా సంతకాల ఉద్యమం జిల్లాలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో భారీ ఎత్తున ప్రజల నుంచి సంతకాలు సేకరించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. జిల్లా స్థాయిలోనే కాకుండా, మండల, గ్రామ స్థాయిలో కూడా పెద్ద ఎత్తున సంతకాలను సేకరించేందుకు ప్రణాళికను రూపొందించారు. దీనికోసం ప్రత్యేక డిజైన్లతో ఫ్లెక్సీ బోర్డులను రూపొందించారు. ఈ బోర్డులపై జైహింద్ లేదా హర్ ఘర్ తిరంగా అని రాసి సంతకాలు చేయాల్సి ఉంటుంది. కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డులో విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళీకృష్ణ, జోసెఫ్, ప్రమీలా గాంధీ, ఆర్‌డీఓలు ఎంవీ సూర్యకళ, ఎ.సాయిశ్రీ, బి.శాంతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, సమాచార పౌర సంబంధాల శాఖ ఎ.డి డి.రమేష్, జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వరరావు, తదితరులు జైహింద్ అని రాసి సంతకాలు చేశారు.



ఫ్లెక్సీపై సంతకం చేస్తున్న జేసీ సేతు మాధవ్

17న పార్వతీపురంలో జాబ్ మేళా

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలో ఈ నెల 17వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఆర్.వహీదా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించే నిమిత్తం హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్ కంపెనీల సౌజన్యంతో జాబ్ మేళాను ఏర్పాటు చేశామని చెప్పారు. 270 ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని, 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి, డిగ్రీ అర్హత గల యువత అర్హులని పేర్కొన్నారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 17వ తేదీన ఉదయం 10:30 గంటల నుంచి జాబ్‌మేళా జరుగుతుందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తిగల యువత డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో జాబ్ సీకర్ లాగిన్‌లో నమోదు కావాలని సూచించారు.

సేవాశ్రమ సంస్థపై విచారణ

- సాక్షి ఎఫెక్ట్



ప్రేమ, వెలుగు సేవాశ్రమ సంస్థలో విచారణ చేస్తున్న శరత్, నాగరాజు, ఉమాభారతి

గంట్యాడ: అనుమతులు లేకుండా ఆశ్రమాలు (హోం) నిర్వహిస్తున్న అంశంపై సాక్షిలో ఈనెల 6వతేదీన 'అనుమతి లేకుండా ఆశ్రమాలు' శీర్షికన ప్రచురించిన కథనానికి బాలల సంక్షేమం, సంస్కరణలు, వీధి బాలల సంక్షేమ శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు గంట్యాడ మండలంలోని కరకవలస గ్రామంలో ఉన్న ప్రేమ వెలుగు సేవా ఆశ్రమ సంస్థలో జిల్లా ప్రొహిషన్ అధికారి ఎం.శరత్, డీసీపీఓ యాళ్ల నాగరాజు, ఐసీడీఎస్ సీడీపీఓ డోకుల ఉమాభారతి బుధవారం విచారణ చేపట్టారు. ఇటీవల ఆశ్రమంలో 21 మంది విద్యార్థులు బిర్యానీ తిని అస్వస్థతకు గురై ఎస్.కోట, విశాఖ కేజీహెచ్ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. దీనిపై కూడా అధికారులు విచారణ చేపట్టారు. అనుమతి లేకుండా, సౌకర్యాలు లేకుండా ఎందుకు హోం నిర్వహిస్తున్నారని సేవా సంస్థ నిర్వాహకులను ప్రశ్నించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని విచారణ అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

పోలీస్ ప్రతిష్ట పెంచేలా వ్యవహరించాలి

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ



మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ



హాజరైన పోలీస్ అధికారులు

విజయనగరం క్రైమ్: పోలీస్ ప్రతిష్టను పెంచే విధంగా అధికారులు, సిబ్బంది వ్యవహరించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ సూచించారు. విశాఖ రేంజ్ డీఐజీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాకు వచ్చిన ఆయనకు ఎస్పీ వకుల్ జిందాల్, ఐదో బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్, ఇతర పోలీసు అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి, స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులతో సమావేశమై, పోలీసు శాఖ ప్రతిష్టను పెంచేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది వ్యవహరించాల్సిన తీరు, నిర్వహించాల్సిన విధుల పట్ల దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హోంగార్డ్స్ నుంచి ఐపీఎస్ అధికారుల వరకూ ఎంతో శ్రమించి, పోలీసుశాఖ ప్రతిష్టను ఇనుమడింపజేసి, దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి పేరును తీసుకువచ్చారని, ఆ ప్రతిష్టను మరింతగా పెంచేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది సత్ప్రవర్తనతో మెలగాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే నిరుపేదలు, మహిళలు, వృద్ధుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారికి అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను శ్రద్ధగా విని, న్యాయం చేసేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సూచించారు.

సోషల్ మీడియాపై నిఘా

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టి, వ్యక్తుల మనోభావాలను కించపరిచే వ్యక్తులపై నిఘా ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు అన్ని ముందస్తు చర్యలను చేపట్టడంతో పాటు, ప్రజలకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో నమోదవుతున్న నేరాల తీరును శాంతి భద్రతల అంశాలను, వాటి పరిరక్షణకు జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న చర్యలను డీఐజీకి వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సాల్మన్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, పలువురు సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలకు భారీగా వసూళ్లు

- ప్రైవేట్ ల్యాబ్స్, క్లినిక్‌లపై ఫిర్యాదులు
- చర్యలకు సిద్ధమవుతున్న అధికారులు



ల్యాబ్‌లో నిర్వహిస్తున్న రక్త పరీక్షలు

పార్వతీపురంటౌన్: ఆరోగ్యానికి సంబంధించి ఎలాంటి సమస్యలున్నా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. వాటిని చేపట్టే ల్యాబ్స్, డయాగ్నోస్టిక్ కేంద్రాలు పార్వతీపురం పట్టణం, మండలాల్లో పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నాయి. నిబంధనలు పాటించకుండా జిల్లాలో కొన్ని చోట్ల నిపుణులు లేక టెక్నీషియన్లు, శిక్షణ సిబ్బందితో పరీక్షలు చేయిస్తుండడంతో ఫలితాల్లో తేడాలు వస్తున్నాయి. దీంతో పలువురు బాధితులు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. జిల్లాలో అన్ని రకాల ప్రభుత్వ ఆస్పత్రులు 49 ఉన్నాయి. ప్రైవేట్ ఆస్పత్రులు 30 వరకు నడుస్తున్నాయి. రోజూ 6,500 నుంచి 7వేల మంది వరకు వివిధ వ్యాధులతో ఓపీకి వస్తున్నారు. వారిలో 2000 మంది వ్యాధి నిర్ధారణ పరీక్షలకు వెళ్తున్నారు. ఎక్కువగా ప్రైవేట్ ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ కేంద్రాలు, క్లినిక్‌లలో పరీక్షలు జరుగుతున్నాయి. మధుమేహం, మలేరియా, టైఫాయిడ్, థైరాయిడ్ మొదలైన 10 నుంచి 15 రకాల పరీక్షలు చేస్తున్నారు. వాటికి రూ.250 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు.

ఇష్టానుసారం ఏర్పాటు..

జిల్లాలో 81 చోట్ల వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. వాటిలో ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ కేంద్రాలు 29, క్లినిక్‌లు 30, ఆసుపత్రులు 12, డెంటల్ క్లినిక్‌లు పది వరకు ఉన్నాయి. ఇవి కాకుండా పదుల సంఖ్యలో అనుమతులు లేకుండా నడుస్తున్నాయి. ఎక్కడ వ్యాధి నిర్ధారణ పరీక్ష చేసినా విధిగా పెథాలజిస్టు ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. జిల్లాలో చాలా చోట్ల పెథాలజిస్టులే లేరు. ల్యాబ్ టెక్నీషియన్ శిక్షణ పూర్తి చేసిన వారు, విద్యార్థులు కనిపిస్తున్నారు.

'ఫలితాల్లో తేడాలు

జిల్లా కేంద్రంలో ఇటీవల ఓ పెద్ద ల్యాబ్‌లో ఒకరు లిపిడ్ ప్రొఫైల్ పరీక్ష చేయించారు. ఫలితం 280గా వచ్చింది. వారం రోజులు మందులు వాడిన తర్వాత మరో ల్యాబ్‌కు వెళ్తే 500గా నమోదైంది. రెండింటిలో ఏది నిజమో తెలియక నమూనాలను ముంబై పంపిస్తే 200గా చూపించింది. ఈ తేడాలతో రోగి, కుటుంబసభ్యులు భయాందోళనకు గురయ్యారు. వైద్యుల చుట్టూ తిరిగి నష్టపోతున్నామని పలువురు వాపోతున్నారు. వ్యాధి నిర్ధారణ సక్రమంగా జరగకపోతే మందులు ఇవ్వడంలో తేడాలు వస్తాయని, రోగి ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని విశాఖ నుంచి వచ్చిన గుండె సంబంధ వైద్య నిపుణుడు తెలిపారు. ఈ ఒక్కటే కాదు పట్టణంలోని పలు ల్యాబ్‌లపై ఇలాంటి ఫిర్యాదులే ఉన్నాయి.

ధ్రువీకరణ తప్పనిసరి



ఎక్కడ నిర్ధారణ పరీక్ష చేసినా విధిగా పెథాలజిస్ట్ ధ్రువీకరణ ఉండాలి. కొన్ని చోట్ల పాటించడం లేదని మా దృష్టికి వచ్చింది. దీనిపై కేంద్రం నుంచి తాజాగా ఉత్తర్వులు వచ్చాయి. ధ్రువీకరణ లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటివరకు ఫిర్యాదులు వచ్చిన ల్యాబ్స్‌పై త్వరలో ముమ్మర తనిఖీలు చేపడతాం.

– విజయ పార్వతి, డీఎంహెచ్‌ఓ, పార్వతీపురం మన్యం